'గోవిందరావుగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు' శ్రీకాంత్ చెప్పాడు.

రంగారావు అలా ఆశ్చర్యంగా ఉండిపోయాడు.

సతీష్, చంద్రం గాసిప్‌కు కొత్త సబ్జెక్టు దొరికిందన్నట్టు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

'ఎవరు చెప్పారు?' ప్రశ్నించాడు రంగారావు.

# కొత్త పెళ్ళికొడుకు

- సి.వి. సర్వేశ్వర శర్మ



'ఒకరు చెప్పడం ఎందుకు ? నేనే చూశాను?' శ్రీకాంత్ జవాబు.

'ఏం చూశావు ?' మళ్ళీ అడిగాడు.

'ఉదయం గుళ్ళోకి వెళ్ళాను. గోవిందరావుగారు కొత్త భార్యను వెంటపెట్టుకుని వచ్చారు. ఎవరావిడ అనుకున్నాను. పూజారి ఆశీర్వచనానికి అడిగాడు. ధర్మ పత్ని అని చెప్పాడు. దండం దేముడికి పెడుతున్నా నా మనను వాళ్ళకేసే లాగేసింది.'

'ఎలా ఉంటుంది?' రంగారావు అనుకోకుండా అనేశాడు.

'చాలా బాగుంది' ఆటోమేటిక్‌గా చెప్పాడు.

అందరూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. నోరు జారినందుకు రంగారావు కొంచెం దిగులుపడ్డాడు.

రంగారావు నలభై ఏళ్ళవాడు. స్కూలు టీచర్. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో శిష్యులు శ్రీకాంత్, సతీష్, చంద్రం. ముగ్గురూ అతి కష్టం మీద గ్రాడ్యుయేట్స్ అయ్యారు. స్కూలు సమయం కాకపోతే రంగారావు దగ్గర చేరతారు. రంగారావుకి పెళ్ళి అయింది. కాని భార్య ఎందు చేతనో కాపరానికి రాలేదు. రంగారావు తీసుకురాలేదని కూడా చెప్పుకుంటారు.

గురు పీఠంలో ఉన్న కారణంగా రంగారావు తన అభిప్రాయాలను శిష్యుల మీద రుద్దుతూ ఉంటాడు. శిష్యులకు కూడా తమను వినిపించుకునే ఒక పెద్ద కావాలి. అందుకే వారి నలుగురి మధ్య సయోధ్య. ఎవరూ చర్చించలేని విషయాలను సహితం చర్చించగలగడం, సమస్యలకు పరిష్కారాలు నిర్ణయించగలగడం, ఏది న్యాయమో తేల్చి చెప్పగలగడం వారి పరిధిల్లో వారు నిత్యం కొనసాగించే కృషి.

రంగారావు స్లోగన్ ఎప్పుడూ ఒక్కటే. పరిశీలించండి, పరిశోధించండి. ఫలితం రాబట్టండి. ఈ ముసుగులో సాగే చర్చలు తారా స్థాయిలో ఉంటాయి. శ్రీకాంత్ పరిశీలన పూర్తి అయింది. ఇక పరిశోధన ప్రారంభించారు.

సాయంత్రం అయ్యేసరికి సతీష్, చంద్రం పోవు సామాగ్రితో వచ్చారు గోవిందరావుగారు పెళ్ళి చేసుకోవడం నిజం. కొత్త పెళ్ళి కూతురు ఊరు కాకినాడ. ఆమెకు అన్నదమ్ములున్నారు. మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. కొత్త పెళ్ళి కూతురు హైస్కూలు చదువు పూర్తి చేసింది. వివరాలు చెప్పారు.

'గోవిందరావు గారు మళ్ళీ పెళ్ళికి ఎలా అంగీకరించారు?' శ్రీకాంత్ ప్రశ్న వేశాడు.

'మగాడన్న తరువాత ఏమి చేసినా చెల్లుతుంది. అసలు మగాడు మగాడే. సినిమాల్లో చూడు - ఎంత ముసలాడయినా హీరోగా నటిస్తాడు. అదే హీరోయిన్ అయితే కొంచెం నలిగేసరికి తల్లి పాత్రలోకి వెళ్ళిపోతుంది' చంద్రం తన నాలెడ్జిని ఉపయోగించి చెప్పాడు.

'డెబ్భయి ఆరేళ్ళ వయసున్న గోవిందరావుగారు పెళ్ళి చేసుకుని భార్యను ఏం చేసుకుంటాడు?' సతీష్ డైరెక్టుగా పాయింట్‌కు వచ్చేశాడు.

'ఆయన్ని అడుగు చెపుతాడు' రంగారావు పెద్ద జోక్ వేసినట్టు అన్నాడు.

'ఆయనెందుకు చెపుతాడు' ఆయనేం చేస్తాడో మనం చెప్పాలి!' చంద్రం అదోలా ముఖం పెట్టి అన్నాడు.

అంత గురు పీఠంలో ఉన్న రంగారావు చంద్రం మాటలకు శిమ్మెడిలా ముఖం పెట్టేశాడు. 'పెన్షన్‌లో పెట్టక నీకు ఏమన్నా తెలిస్తే చెప్పి తగలడు' సతీష్ వారిద్దరి మధ్యా గల చనువు అడ్డం పెట్టుకుని కొంచెం కసిరినట్టు మాట్లాడాడు.

'నువ్వు అలా మాట్లాడితే చెప్పాల్సిన అవసరంలేదు. నాలెడ్జి ఈజ్ పవర్. బుద్ధిగా ఉంటే చెబుతా' చాలా గీరగా పెట్టాడు ముఖం.

'వాడు బుద్ధిగా వింటాడు చెప్పు' సతీష్ బ్రతిమాలు తున్న ధోరణిలో అన్నాడు.

'డెబ్భయి సంవత్సరాలు దాటిన వాళ్ళు సెక్సులో చురుగ్గా పాల్గొంటారు తెలుసా!'

'ఊరుకోవయ్యా! యాభై సంవత్సరాలు వచ్చేసరికి మనిషి అవుట్. అసలు నలభై సంవత్సరాలు దాటితే గరల్స్ హైస్కూల్లో మాస్టరుగా వేస్తారు తెలుసా?' సతీష్ అడ్డం తగిలాడు.

'చీమ తలకాయ గాడివి. అంతకంటే నీకు ఏమి తెలుస్తుంది?' శ్రీకాంత్ చంద్రానికి సపోర్టు ఇచ్చాడు.

'మాస్టార్ని అడుగు కావాలంటే?' సతీష్ అన్నాడు.

'సతీష్ నువ్వు ఊరుకో. చంద్రాన్ని పూర్తిగా చెప్పనియ్! అప్పుడు మనం మాట్లాడవచ్చు' రంగారావు పరోక్షంగా చంద్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

'డెబ్బయ్ సంవత్సరాలు దాటిన మగవాడికి సెక్స్ అంటే పిచ్చి ఎక్కువగా ఉంటుంది. ఆ వయసులో వెచ్చదనం, సెక్సులోని ఆనందాన్ని చాలా ముఖ్యమైన అంశంగా భావిస్తారు' చంద్రం మళ్ళీ అందుకున్నాడు.

'నీ కెలా తెలుసు. నీకు పూర్తిగా పాతికేళ్ళయినా లేవు' సతీష్ అడ్డం కొట్టాడు.

'అదే! తెలివి తక్కువ ప్రశ్న. పాతికేళ్ళ యువకుడు ఐ. ఎ. ఎస్. అవుతాడు. యాభై ఏళ్ళ గుమాస్తా ఐ. ఎ. ఎస్. ని కుర్రాడివి నీకేం తెలుసు అంటాడా?' చంద్రం అడిగాడు.

'నువ్వు చెప్పవయ్యా? అతని గొడవెందుకు?' శ్రీకాంత్ ఆసక్తిగా అడిగాడు.

'ముసలివాళ్లకు సెక్సు అంటే ప్రాణం. వీలుంటే సెక్సులో చురుగ్గా పాల్గొంటారు. సెక్సు అంటే ఎక్కువ విలువ ఇస్తారు. సెక్సులో పాల్గొనేందుకు వాళ్లకు ఇష్టమైన పద్ధతులు ఎంచుకుంటారు. చిత్రం ఏమిటంటే సెక్సులో ఆరితేరిన విజ్ఞానం గలవారి భావనలు ఇందుకు భిన్నంగా ఉంటాయి. వారు డెబ్భయి సంవత్సరాల వయసుదాటిన వారి గురించి పట్టించుకోకపోవడం ఒక కారణం కావచ్చు. వారికి అటువంటి అభిప్రాయాలు ఉండడానికి' చంద్రం గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

'నీకు ఎలా తెల్సు' ఈ సారి రంగారావు అడిగాడు.

'మా వాడు పుస్తకాలు గట్టిగా చదువుతాడు సార్!' శ్రీకాంత్ అన్నాడు. సెక్సు సంగతులు నాకన్నా పిల్లలకే ఎక్కువ తెలుసన్నమాట అని మనసులో అనుకున్నాడు.

'నువ్వు చెప్పినదానికి ఆధారం ఏమిటి?' చంద్రం అడిగాడు



"ఏమండీ బయట వర్షం కురుస్తున్నట్టుంది" కుతూహలంగా చెప్పింది భార్య.
"బయట కాకపోతే ఇంట్లో కురుస్తుందా వర్షం?" విసుగ్గా ప్రశ్నించాడు భర్త.
-ఎ.మహేందర్
వలిగొండ

'అమెరికాలో ఒక స్వచ్ఛంద సంస్థ అనేక మందిని ఇంటర్వ్యూ చేసింది. చాలా ఆసక్తికరమైన విషయాలు ప్రకటించింది' చంద్రం చెప్పాడు.

'డెబ్భయి సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరి ప్రవర్తన సెక్సువల్ల ఆ విధంగా ఉంటుందంటే నేను అంగీకరించను' సతీష్ నిక్కచ్చిగా చెప్పాడు.

'డెబ్భయి దాటిన వారిలో మూడొంతులు మంది మగవారిలోను, సగం మంది ఆడవారిలోను సెక్సు అంటే మంచి ఆసక్తి ఉంటుంది'.

'సయం. వారంతా సెక్సులో పాల్గొంటారన్నావు కాదు' సతీష్ అన్నాడు.

'నువ్వు టాపిక్ ఎత్తావు కాబట్టి చెబుతున్నాను. పెళ్లయిన ఆడవాళ్లల్లో మూడు వంతులు మంది భర్తతో వారానికి ఒకసారి కలుస్తారు' చంద్రం చెప్పాడు.

రంగారావు అదిరిపోతున్నాడు. ఈ కుర్రకారుకి ఇంత నాలెడ్జి ఎలా వచ్చిందా అని- చిన్నప్పుడు సైకాలజీ మాష్టారు చెప్పాడు. పాతికేళ్లవరకు గొప్ప జ్ఞాపక శక్తి ఉంటుందట. అక్కర్లేని సమాచారం పేజీలతో సహా గుర్తు పెట్టుకుంటారట. వీళ్లంతా ఆ బాపతు అన్న మాట. అయితే వివేకం పెరుగుతుంది. అందుకే మనిషి ఆచితూచి మాట్లాడడం మొదలుపెడతాడు.

'ఇంకా స్వచ్ఛంద సంస్థ ఏ విషయాలు చెప్పింది' శ్రీకాంత్ కుతూహలం ఆగక అడిగాడు.

భర్తలు పోయినవారు, భార్యలు పోయినవారు, విడాకులు తీసుకున్నవారు, అసలు పెళ్లికానివారు వారి జీవితాల్లో యాభయి, అరవై సరస సంవత్సరాల వయసులో సెక్సులో గొప్ప చురకుదనం కల్గి ఉంటారు. అదేవిధంగా డెబ్భై సంవత్సరాల వయసులో సగం మంది ఆ విధంగా ఉంటారు.'

రంగారావుకు చురుక్కుమంది. చంద్రం అర్థోక్తిగా మాష్టారుకేసి చూశాడు. తనకు సంబంధించని విషయం అన్నట్లు రంగారావు ఎటో చూస్తున్నాడు.

'ఆడవారికి అటువంటి ఫీలింగ్స్ ఉంటాయంటే నమ్మశక్యంగా లేదు' అన్నాడు శ్రీకాంత్.

నీకో విషయం చెపితే మతిపోతుంది.

'పెళ్లయి 38 సంవత్సరాలుగా సంసారం చేసుకుంటున్నామెను ఇంటర్వ్యూ చేశారు. ఆమెకు భర్త గొంతు టెలిఫోన్‌లో విన్నా రోడ్డుమీద వస్తున్నట్లు కన్పించినా ఒళ్లు తెలియని ఆవేశం వస్తుందట. భర్త తనమీద చేయివేస్తే ఇక తట్టుకోలేదట.

అడ్డు తగిలితే చంద్రం కూడా శ్రోత అయిపోయాడు. సెక్సు చాలా మందికి తెలిసిన విషయం. అయినా ఇంకా అందులో ఏదో ఉందని దానిని విందామని, చూద్దామని అంతులేని కుతూహలం. ఆ బలహీనతను అడ్డంపెట్టుకుని వ్యాపారాలన్ని బ్రహ్మాండంగా ఈ భూమ్మీద జరిగిపోతున్నాయి. రంగారావు కలుగజేసుకున్నాడు.

'చంద్రం నువ్వు చెపుతున్నదాంట్లో సత్తాలేదోయ్. ఎందుకంటే సాధారణంగా మనిషికి వయసుమళ్లుతూంటే అనేక అనారోగ్యాలు చేస్తాయి. కొంతమందికి చక్కెరవ్యాధి, మరికొంతమందికి రక్తపోటులో తేడాలు, గుండెజబ్బులు ఇలా రకరకాలుగా వ్యాధిగ్రస్థులవుతూ ఉంటారు. ఆ వ్యాధితో బాధపడేవారికి సెక్సులో శ్రద్ధ ఏమి ఉంటుంది? పైగా వాళ్లు వాడే మందుల ప్రభావం సెక్సు జీవితాన్ని దెబ్బతీస్తాయి' రంగారావును సతీష్ సమర్థించాడు. చంద్రం ఏమి చెపుతాడోనని శ్రీకాంత్ ఆసక్తితో వింటున్నాడు.

'ఆరోగ్యంగా ఉన్నవారికి, అనారోగ్యంతో ఉన్నవారికి సెక్సు విషయంలో చురుకుదనంలో తేడా చాలా స్వల్పంగా ఉంటుందని పరిశోధనలలో వెల్లడయ్యిందట'

చంద్రం జవాబుకి రంగారావు తెల్లబోయాడు.

'సెక్సు పట్ల ఆసక్తి వేరు, సెక్సులో పాల్గొనడం వేరు. సెక్సుపట్ల ఆసక్తిని పుస్తకాలు సినిమాలు తీర్చవచ్చు. పాల్గొనాలంటేనే చిక్కు' అన్నాడు శ్రీకాంత్.

సెక్సు గురించి వినడానికి హితవుపడే శ్రీకాంత్ అభిప్రాయాలు చెప్పడం రంగారావుకు ఆశ్చర్యం వేసింది.

'డెబ్భయి ఏళ్లు ధాటిన ప్రతి పది మందిలో ఆరుగురు ఇంకా క్రమం తప్పకుండా సెక్సులో పాల్గొంటారు. కాకపోతే పది పదకొండు రోజులకు ఒకసారి' చంద్రం సెక్సు బాంబులు పేలుస్తుంటే అవాక్కయి వింటున్నారు. 'ముసలాళ్లు చీకటి పడితే విశ్రాంతికి ఇష్టపడతారు గాని సెక్సు పట్ల చురుగ్గా ఎలా ఉండగలుగుతారు?' చంద్రానికి బ్రేకు వేశాడు సతీష్.

'చాలా మంది ముసలివాళ్లు సెక్సుకి ఉదయం సమయం ఎంచుకుంటారు. ఎందుకంటే వారికి ఆ సమయంలో శక్తి పోగు పడి ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్నవారి విషయంలో కూడా వయసు పెరగడం వల్ల కణాలు, నరాల వ్యవస్థ అంత పటిష్ఠంగా ఉండదు. అందుకే సెక్సు ప్రతిస్పందనలు శారీరకంగా అంత హెచ్చుగా ఉండవు. బలహీనంగా ఉంటాయి. స్త్రీల విషయంలో కూడా అంగం తడారిపోయి సెక్సులో పాల్గొనడానికి పెద్దగా అనుకూలంగా కూడా ఉండదట.

'నువ్వే చెబుతున్నావు కదా! సెక్సు కుదరడం కష్టమని. మరి వాళ్లంతా సెక్సులో పాల్గొంటారని ఎలా సమర్థించగలవు?' సతీష్ ఎదురు ప్రశ్న వేశాడు.

'వాళ్లు కాదు, ముసలాళ్లు. బోలెడంత అనుభవం ఉంటుంది. ఆ రసాలన్నీ ఊరేందుకు కావలసిన తొలి క్రీడలెన్నో చేస్తారట. అవన్నీ మనకి ఎలా తెలుస్తాయి' చంద్రం చెప్పాడు.

రంగారావు మనసులో తను వదులుకున్న భార్య కన్పిస్తోంది. ఉద్యోగ రీత్యా పవిత్రత ఆచరణంగా తయారయింది. శరీర వాంఛలను అణగదొక్కుకోకూడదు. మేకును ఎందులోనైనా దిగవేస్తేనే దాని ఉపయోగం అవతలి వస్తువుకు ప్రయోజనం. లేకపోతే డబ్బాలో మేకుల్లో మేకుగానే ఉండిపోతుంది.

తన భార్యను మెల్లిగా ఒప్పించి తెచ్చేసుకుంటే మంచిది. రంగారావు ఆలోచనలు మెల్లిమెల్లిగా తన కుటుంబం మీదకు వెళ్లాయి.

పెళ్లయిన తరువాత తన భార్య కన్నా మామ కూతురుగానే మాట్లాడడం రంగారావు సహించలేకపోయాడు. ప్రతి చిన్న విషయానికి భార్య అబద్ధం చెప్పడం తట్టుకోలేకపోయాడు. నమ్మిక లేని జీవితం నడవదని నిర్ణయించుకున్నాడు.

భర్త మీద అనురాగం, ప్రేమ క్రమంగా పెరుగుతాయని తల్లి ఎంత చెప్పినా రంగారావు అంగీకరించలేకపోయాడు. ఫలితంగా భార్యాభర్తల మధ్య దూరం పెరిగింది.

ఇన్నాళ్ల తరువాత భార్యను తెచ్చుకుంటే తనతో సహకరించి ఆనందం కలిగించి పొందగలదా? రంగారావు ఆలోచనలో పడ్డాడు.

'సెక్సు లేకపోతే ముసలివాళ్లు' తమ జీవితాలను హాయిగా గడపలేరంటావు?'' సతీష్ అడిగాడు.

'అలా అని నేను అనలేదు. సాహచర్యం, కలసి జీవించడం వృద్ధ దంపతులకు ఎనలేని ఆనందాన్ని కలుగజేస్తాయి. వీటికి తోడుగా వారికి సెక్సు ఉంటే జీవితం మరింత ఆనందదాయకంగా ఉంటుంది' చంద్రం చెప్పాడు.

'గోవిందరావు మాష్టారి భార్య పోయి ఆరు నెలలు కాలేదు. మళ్లీ పెళ్లి చేసుకున్నాడంటే సెక్సు కోసమేనంటావా?' సతీష్ అడిగాడు.

సతీష్ ప్రశ్నకు చంద్రం నిశ్చేష్టుడయ్యాడు. అని నేను ఎప్పుడు అన్నాను?' చంద్రం తడబడుతూ అన్నాడు.

'మాష్టారి గురించే నేను ఏమీ అనను. అనలేను. అమెరికాలో జనజీవితాల గురించి చేసిన పరిశోధనా ఫలితాలు చెప్పాను. అంతకు మించి నాకు తెలీదు'.

'మాష్టారు డెబ్బయి ఆరు ఏళ్ల వయసులో కొత్త పెళ్లికొడుకులా సెక్సులో పాల్గొనకపోతే వచ్చిన పెళ్లాం ఊరుకుంటుందా? పెళ్లి పరమార్థం తొలిగా సెక్సు ఆ తరువాతే ఏదయినా' రంగారావు మనసులో అనుకున్నాడు.

కుర్రాళ్లు ఎక్కువగా చనువు తీసుకుని మాట్లాడుతున్నారు. ఎవరి హద్దులో వాళ్లుండాలి. అందుకే ఈ సంభాషణ ఆపెయ్యాలి.

మనం స్థాయి మించి చర్చిస్తున్నాం. ఎవరైనా వింటే బాగుండదు. నాకు కొంచెం పనుంది' అందరిని వెళ్లిపొమ్మని అర్థోక్తిగా చెప్పాడు. మౌనంగా అందరూ వెళ్లిపోయారు.

రంగారావు మెదడు నిండా ఆలోచనలే. అమెరికా అయినా ఇండియా అయినా మనిషి మనస్తత్వం ఒక్కటే. అక్కడ మనుషులకు అసలైన స్వేచ్ఛ ఉంది. అందుకే మనసులో మాటలు చెప్తారు. ఇండియాలో ఇటువంటి విషయాలపై పరిశోధనలు చెయ్యరు. చేసినా ఫలితాలు ప్రకటించలేరు. తన భార్యను తెచ్చుకుంటే ఒంటరి జీవితానికి స్వస్తి చెప్పవచ్చు. కాని అది సాధ్యమవుతుందా? తప్పు ఎక్కడ జరిగినా చివరకు భార్యాభర్తలు అనుభవించాలి శిక్ష. అందుకే ఒకరినొకరు అర్థం చేసుకొని మన్నించుకుంటూ, గౌరవించుకుంటూ ఏక మాట మీద గడపాలి జీవితం. అలా చేయలేకపోతే సంసారం నరకంగా మారుతుంది. రంగారావు తనకున్న అనుభవంతో రకరకాల ఊహాగానాలు చేసుకుంటున్నాడు.



"నాతో విశ్వాసహీనంగా ప్రవర్తించావు. నీ అంతరాత్మ పశ్చాత్తాపపడటం లేదా?'' బాధగా అడిగాడు రాజు.

"నిజమే! కానీ నేను ఇతరుల ఆలోచనను పరిగణనలోకి తీసుకోను'' చెప్పాడు కిరణ్.

-ఎం.అనురాగ్
వీణవంక

రంగారావు మర్నాడు సాయంత్రం ఇంటి అరుగు మీద సుంచున్నాడు. రోడ్డే గోవిందరావు మాష్టారు మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్నాడు. 'నమస్కారం. మాష్టారు' పలకరించాడు రంగారావు.

గోవిందరావు మాష్టారు చిరునవ్వు నవ్వాడు. రంగారావు రమ్మని ఆహ్వానించాడు. గోవిందరావు రంగారావుతో బాటు ఇంట్లోకి వచ్చి కూర్చున్నాడు.

'ఏమిటి విశేషాలు మాష్టారు' రంగారావు అడిగాడు.

'మీరు ఎప్పుడూ కుర్రాళ్ళతో గడుపుతారు. విశేషాలు మీకే తెలుస్తాయి' గోవిందరావు అన్నాడు.

'ఏదో గాసిప్ కోసం మాష్టారు. అంతే' రంగారావు అన్నాడు.

'గాసిప్ చాలా మంచిది' గోవిందరావు అన్నాడు.

రంగారావుకి మతిపోయింది. వ్యంగ్యంగా అంటున్నాడు గోవిందరావుగారు అనుకున్నాడు. కళ్ళజోడులోంచి రంగారావుని చూసి గోవిందరావు చెప్పడం ప్రారంభించాడు.

'గాసిప్ మానవ మేథస్సుకి ప్రతీక. ఈ సమష్టి కార్యక్రమం సామాజిక రథచక్రాలు తిరగడానికి పనికివచ్చే గ్రీజు లాంటిది. సమాజంలో మనకున్న అవగాహన పెరుగుతుంది. ఆడా, మగా తేడా లేకుండా సాధారణంగా రోజుకి ఏడు గంటలవరకూ ఆ గాసిప్‌తో కాలక్షేపం చేస్తారు' జీవితాన్ని కాచి వడబోసిన గోవిందరావు మాష్టారు అందిస్తున్న సందేశం. తెలిసీ తెలియనివారు సులువుగా వాడే 'సుత్తి' అసలు కథ ఇదన్నమాట. కాసేపు వారిమధ్య అనేక విశేషాలు కబుర్లల్లో దొర్లాయి.

'మీరు వండుకుంటున్నారా? హెూటల్ భోజనమా?' రంగారావు చాలా లౌక్యంగా అడిగాడు.

ఆరడుగుల నల్లని భారీ విగ్రహం కళ్ళజోడులోంచి రంగారావును చదువుతూ అన్నాడు 'నేను రజనిని పెళ్లి చేసుకున్నాను' రంగారావు నెత్తిన పిడుగు పడినంతపనయ్యింది. ఆ తర్వాత ఏమి మాట్లాడాలో తోచలేదు. గోవిందరావు మిగతా కథ చెప్పడం ప్రారంభించాడు.

'నా మొదటి భార్య పోయింది. పెద్ద కార్యానికి బంధువులంతా వచ్చారు. ముసల్ది భర్త చేతిలో వెళ్లిపోయింది. అదృష్టవంతురాలు' మెచ్చుకున్నారు ఆమె మరణాన్ని. బంధువులను చూసి నాకు లోటులేదని, రాదని ధైర్యం తెచ్చుకున్నాను.

'నీకు గ్యాస్ స్టవ్ ఎందుకు? నాకిచ్చెయ్. గాడ్రేజ్ బీరువా నాకు చెప్పకుండా ఎవరికి ఇవ్వకు. టైప్‌మిషన్ నాది ముందే చెపుతున్నాను...' ఇలా వచ్చినవారందరూ నా సామానంతా తలొకరు పంచుకుంటున్నారు. నా గురించి ఎవరూ మాట్లాడలేదు. కనీసం నా దగ్గర ఉండండి అని ఎవరూ పిలవలేదు.

ఇంటికి రావడం ఆలస్యమైతే నా భార్య నాకోసం ఎదురుచూడడమే కాదు నేను తరచు వెళ్ళే మిత్రులు ఇంటికి వెళ్లి నేను ఎక్కడికి వెళ్లింది తెలుసుకునేది. నా జీవితంలో ఆమె అమృతం కురిపించింది. ఇప్పుడు ఆమె లేదు. పిల్లలంతా వారి వారి జీవితాల్లో సెటిల్ అయిపోయారు. ఎవరెవరికి ఏమేమి ఇవ్వాలో వాళ్ళకి అన్నీ ఇచ్చేశాను. నా దగ్గర ఇప్పుడు నా పెన్షన్, వంట చేసుకునే సామాగ్రి, ఏదో కొద్దిగా క్యాష్ ఉంది.

రజని మన ఊళ్ళో కరణంగారి దూరపు బంధువు. అందరూ వాళ్ళింట్లో బాగా సెటిల్ అయ్యారు. రజనికి పెళ్లి ఎందుకు కాలేదో ఎవరికి తెలియదు. యాభయి నాల్గేళ్ళు ఆమెకు. అన్నదమ్ములంటే ఆమెకు అభిమానం. కాని వాళ్ళెవరికి ఈమె అంటే ప్రేమ, అభిమానం లేవు. ఒక సేవాసంస్థలో నడ్డి విరిగేలా చాకిరి చేస్తూ జీవితం గడుపుతోంది.

కరణంగారు కదిపారు. రజనిని నన్ను పెళ్ళి చేసుకోమన్నారు. నేను ఆలోచించాను. నాకు పెన్షన్ వస్తోంది. నేను మరణిస్తే పెన్షన్ కూడా మరణిస్తుంది. పెళ్ళి చేసుకుంటే భార్యకి పెన్షన్ ఇస్తారు. ఇది పిల్లలకు అప్పచెప్పలేను. కనీసం ఒక పెళ్ళికాని అభాగ్యురాలిని ఉద్ధరించినట్లవుతుంది అనుకున్నాను.

రంగారావు మనసు వికసిస్తోంది. గోవిందరావు మీద గౌరవం పెరుగుతోంది.

అందుకే అంగీకరించాను. రజని నా భార్య అయ్యింది. నాకంటే రెండో పెళ్ళి. జీవితం పూర్తిగా అనుభవించనవాడిని. రజనికి ఇది మొదటి పెళ్లి. ఆమె సరదాలు తీర్చాలి. ఊళ్ళో జనం నా పక్కన రజని నడిస్తే అంగీకరించలేరు. ఎందుకంటే అది మన సమాజం లక్షణం. అందుకే రెండు నెలలు హైదరాబాద్‌లో రజనిని తిప్పాను. ఆమె సరదాలన్నీ తీర్చాను.

గోవిందరావును అంచనా వేయలేకపోతున్నాడు రంగారావు.

ఆమె కోరిక ఈ ఊళ్ళో గుడికి తీసుకువెళ్ళమంది. తీసుకువెళ్ళాను. నా మొదటి భార్యలా ఈమె నాపట్ల ప్రవర్తించాలని అనుకోను. ఆమె జీవితం లోతుపాతులు కష్టసుఖాలు నాతో పంచుకుంది. మా ఇద్దరి మధ్య అనురాగం, ప్రేమ, అభిమానం ఉండేవి'.

'మరి ఇప్పుడు?' రంగారావు అప్రయత్నంగా అడిగాడు.

'నా జీవితంలో ఆ అధ్యాయం ముగిసింది. ఇప్పుడు నా అవసరాలు గడవాలి. మంచి భోజనం కావాలి. నాకోసం ఎదురుచూసే మనిషి కావాలి. అందుకే రజని' గోవిందరావు ముగించాడు.

కుర్రాళ్లు పెళ్లిని సెక్సుకోణంలో చూస్తారు. నడివయస్కులు విమర్శనా ధోరణితో చూస్తారు. పెళ్లి చేసుకున్నవాడు తన అవసరం గడవడం కోసం. తను చేస్తున్నది న్యాయం అనుకుని చేస్తాడు. ఇతరులకు అది అన్యాయంగా కన్పించి ఎలుగెత్తి అరుస్తూ అల్లరి చేస్తారు. ఎవరి అవసరాలు వారివి. అలా అని సమాజం మౌనంగా ఉండదు. రంగారావు సమాజాన్ని అర్థం చేసుకోవడం కష్టం అనుకున్నాడు.